# ఆర్థికపరిస్థితి మెరుగుపర్చేలా రుణాలు ఇవ్వాలి

ఆదిలాబాద్ : కుటుంబ ఆర్థికపరిస్థితిని మెరుగుపర్చేలా లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని పాలనాధికారి బుద్ధప్రకాష్ ఎం.జ్యోతి బ్యాంకర్లను ఆదేశించారు. పాలనాప్రాంగణ సమావేశమందిరంలో రుణ ప్రణాళిక అమలుపై సమన్వయసమావేశం నిర్వహించారు. అర్హులైన వారికి ఇబ్బందులు పెట్టకుండా రుణాలు ఇవ్వాలని పేర్కొన్నారు. బ్యాంకర్లు ప్రతి సమావేశానికి హాజరుకావాలని స్పష్టంచేశారు. ఇప్పటివరకు 51,788 మంది రైతులకు పంటరుణాలు ఇచ్చారని, లక్ష్యం మేరకు మిగిలిన వారందరికి నెలాఖరులోగా రుణాలు ఇవ్వాలని పేర్కొన్నారు. హరితహారం కార్యక్రమంలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలన్నారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం ప్రసాద్, నాబార్డు డీజీఎం పురోహిత్, ఆర్‌బీఐ ప్రతినిధి అనిల్, జిల్లాగ్రామీణాభివృద్ధి అధికారి రాజేశ్వర్‌రాథోడ్, మున్సిపల్ కమిషనరు మారుతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు

### ప్రవాస భారతీయులను అలరించిన నృత్యాలు



ఉట్నూరు : కొండకోనల్లో గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన విద్యను నేర్చుకోవడం అభినందనీయమని అమెరికాలోని న్యూజెర్సీ, అట్లాంటా ప్రాంతాలకు చెందిన ప్రవాస భారతీయులు (ఎన్‌ఆర్‌ఐ) సంధ్య, మురళి, అశ్విన్, కౌస్తు, రిషిత, చిన్ను, శ్రావ్య అన్నారు. ఉట్నూరు మండలంలోని బీర్సాయిపేటలోని చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకులం పాఠశాలను అమెరికాలోని న్యూజెర్సీ అట్లాంటా ప్రాంతాలకు చెందిన ప్రవాస భారతీయులు సందర్శించారు. గురుకులంలో విద్యార్థులు నేర్చుకుంటున్న విద్య తీరును పరిశీలించారు. వారికి అందుతున్న బోధనాంశాలతో పాటు సంస్కృతి, సంప్రదాయలను అడిగి తెలుసుకున్నారు. వారు చదువుతున్న తీరు బాగుందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతూ మీతో పాటు మీరు పెరుగుతున్న విధంగా మొక్కలను పెంచాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఆలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు వారిని ఆకట్టుకున్నాయి. ఈ పాఠశాలలో చదువుకోవడం మీ అదృష్టమని, గురువులు సూచించిన సూచనలు పాటించి చదువులో రాణించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు రాజు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి, శిక్షణకు నమోదు చేస్తే ప్రోత్సాహకాలు

### రెండు జిల్లాల లక్ష్యం 950 మంది

ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని మెప్మా పరిధిలో నిర్వహిస్తున్న జాతీయ పట్టణ జీవనోపాధుల కేంద్రాల ద్వారా 2017-18 ఆర్థిక సంవత్సరంలో 950మందికి శిక్షణతో కూడిన ఉపాధి అందించాలని లక్ష్యంగా నిర్దేశిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. అందుకనుగుణంగా పనిచేసే కమ్యూనిటీ ఆర్గనైజర్‌లకు, క్లస్టర్‌రిసోర్స్ పర్సన్‌లకు, రిసోర్స్ పర్సన్‌లకు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఎంత మందిని శిక్షణకు రిజిస్ట్రేషన్ చేయిస్తే వారికి అన్ని వందల రూపాయలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని పుర, నగరపాలకాలకు లక్ష్యాలను నిర్దేశిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న అనంతరం ఎంపిక చేసుకున్న సంస్థలో శిక్షణ పూర్తిచేస్తే మరో రూ.100 చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఇందు కోసం రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసిన మూడు సంస్థల్లో వారిని శిక్షణకు పంపాలని ఈ ఆదేశాల్లో సూచించారు. ఖమ్మం నగరపాలక సంస్థకు 300మంది, మధిర, సత్తుపల్లి పురపాలకాలకు 50మంది చొప్పున, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం పురపాలకానికి 200 మంది, మణుగూరు, ఇల్లెందులకు 100మంది చొప్పున, పాల్వంచకు 150మందిని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ నెలాఖరు నాటికి నిర్ధేశించిన లక్ష్యాల్లో 50శాతం కచ్చితంగా పూర్తిచేయాలని పేర్కొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ముట్టడి

కొత్తగూడెం : రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి, జైలుభరో నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా మాట్లాడుతూ రైతులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. తెరాస ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. పోడు సాగు చేసుకుంటున్న రైతులపై అటవీ శాఖాధికారులు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆందోళనలు చేస్తున్నవారిని పోలీసులతో అణగదొక్కాలని చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదన్నారు. బంగారు తెలంగాణ వచ్చేసినట్లు ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, ప్రజలన్నీ గమనిస్తున్నారన్నారు. అనంతరం సీపీఐ కార్యకర్తలు, రైతులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయడంలో పోలీసులు వారిని అరెస్ట్ చేసి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, రావులపల్లి రాంప్రసాద్, మండే వీరహనుమంతరావు, పూనెం శ్రీను, బరిగెల సాయిలు, నరాటి ప్రసాద్, గుత్తుల సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, సలిగంటి శ్రీనివాస్‌రెడ్డి, జమలయ్య, జోసేఫ్, రమాదేవి, లక్ష్మీకుమారి, డి.శేషయ్య, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

## పనితీరుతో పేరు తెచ్చారు

రామాయంపేట: సిబ్బంది తమ పనితీరుతో సంస్థకు, ప్రభుత్వానికి పేరు తీసుకువచ్చారని 108 వైద్యసేవల రాష్ట్ర ముఖ్య కార్యనిర్వహణాధికారి(చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్) బ్రహ్మానందరావు పేర్కొన్నారు. రామాయంపేటలోని వివేకానంద ఆవాస విద్యాలయంలో ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల్లోని 108 సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద సమయంలో సిబ్బంది పనితీరు, స్పందన, ప్రభుత్వం నుంచి వైద్యసేవల కోసం సరఫరా అవుతున్న వాటిని(దూది, గ్లూకోజ్) సక్రమంగా వాడుతున్నారా లేదా అనే అంశాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో విధుల్లో మెరుగైన పనితీరును కనబర్చిన ఎనిమిది మంది పైలట్(డ్రైవరు,) ఈఎంటీలకు ప్రశంసాపత్రాలు, అవార్డులు అందజేశారు. మూడు నెలలకోసారి పరిశీలించి వీటిని అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్‌లో 30, నిజామాబాద్‌లో 27 వాహనాలు ఉన్నాయన్నారు. మిగతా సిబ్బంది పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. రీజినల్ మేనేజర్ ఖాలీద్, ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి జాన్‌షాహేద్, హెచ్‌వోడీ సత్యనారాయణ, రామాయంపేట సిబ్బంది సత్యనారాయణ, చంద్రం, ఆసిఫ్, శ్రీనివాస్, నీలేష్ తదితరులు ఉన్నారు.

## యువజన, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

మహబూబ్‌నగర్ : తెలంగాణ ఇంటి పార్టీ అనుబంధ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర తొలి మహాసభలు ఆగస్టు 5న హైదరాబాదులో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాకేశ్‌పటేల్ వెల్లడించారు. మహబూబ్‌నగర్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర మహాసభల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాకేశ్ పటేల్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురయిందని ఆరోపించారు. విద్యాహక్కు చట్టం అమలుతోపాటు వివిధ పోటీ పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం విఫలమయిందన్నారు. ఉపకార వేతనాలు, ఫీజు బకాయిలు చెల్లించకుండా నిరుపేద విద్యార్థులను మోసం చేసిందని విమర్శించారు. విద్యార్థుల సంఖ్య తక్కువుందనే సాకుతో కొన్ని పాఠశాలలను మూసివేసే యత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తమ పోరాట భవిష్యత్తును రాష్ట్ర మహాసభల్లో చర్చించి తీర్మానించనున్నట్లు వెల్లడించారు. మహాసభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గౌతమ్, సొహెయిల్, దశరథ్ రాథోడ్, సందీప్, భాస్కర్, రాము, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 30న గజ్వేల్‌లో అమరుల స్ఫూర్తి యాత్ర: తెవివే

హుస్నాబాద్ : తెలంగాణ ఐకాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్ఫూర్తి యాత్రలో భాగంగా ఈ నెల 30 గజ్వేల్‌లో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి డ్యాగల సారయ్య తెలిపారు. హుస్నాబాద్‌లోని వీఎల్ రెడ్డి గార్డెన్‌లో జరిగిన హుస్నాబాద్ ప్రాంత ఐకాస ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. పాలన పక్కదారి పట్టకుండా ఉండేందుకు, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా స్ఫూర్తి యాత్ర చేపట్టిందన్నారు. ఐకాస ఛైర్మన్ కోదండరాంతో పాటు పలువురు నాయకులు హాజరయ్యే సభకు ఈ ప్రాంతం నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కన పెట్టి అప్రజాస్వామికంగా పాలన సాగిస్తున్నారని మండల ఐకాస ఛైర్మన్ వడ్డేపల్లి మల్లేశం అన్నారు.వరంగల్ అర్బన్ జిల్లా కన్వీనర్ చెప్యాల ప్రభాకర్, జిల్లా కోకన్వీనర్ గాదెపాక రవీందర్, తెవివే మండల కన్వీనర్ బోయిన ప్రతిభా భారతి, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల శ్రేయస్సుకు భారీగా నిధులు



మనోహరాబాద్: రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం కోట్ల రూపాయాల నిధులను ఖర్చు చేస్తుందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మనోహరాబాద్ మండలం రామాయపల్లి గ్రామ శివారులో రూ.3 కోట్లతో నిర్మించిన గోదామును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రైతులు పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు రాష్ట్రంలో రూ.1100 కోట్లతో 355 గోదాములను నిర్మించాం. వీటిలో 54లక్షల మెట్రిక్‌టన్నుల ఉత్పత్తులను నిల్వ చేయవచ్చాన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో రూ.27కోట్లతో తొమ్మిది గోదాములను నిర్మించామని.. ఇందులో 45 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉంచవచ్చని పేర్కొన్నారు. శీతలగిడ్డంగిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. ఉమ్మడి తూప్రాన్ మండలంలో ఏకంగా రూ.10 కోట్లకుపైగా నిధులతో వివిధ ప్రగతి పనులు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గం కావడంతోనే ఇంత పెద్దమొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వాల హయాంలో విత్తనాలు, ఎరువుల కోసం అన్నదాతలు రాత్రింబవళ్లు వరుసలో నిలబడి ఇబ్బందులు పడేవారని.. తెరాస సర్కారు వచ్చాక సమస్యలు తొలగిపోయాయన్నారు. రాబోయే రోజుల్లో ఎకరాకు రూ.8వేలు చెల్లించాలని నిర్ణయించడం.. తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శం కానుందని మంత్రి వివరించారు. ఈ సందర్భంగా గోదాము ఆవరణంలో మొక్కను నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ల ఛైర్మన్లు ఎలక్షన్‌రెడ్డి, నర్సారెడ్డి, భూంరెడ్డి, జిల్లా సంయుక్త పాలనాధికారి సురేశ్‌బాబు, ఆర్డీవో ఓజే మధు, ఎంపీపీ గుమ్మడి శ్రీనివాస్, వంటిమామడి ఏఎంసీ ఛైర్మన్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## తెరాస పాలనలో రక్షణ కరవు

### మాజీ మంత్రి గీతారెడ్డి ధ్వజం



మెదక్: తెరాస ప్రభుత్వ పాలనలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వారికి రక్షణ కరవైంది. పలు వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని మాజీ మంత్రి, జహీరాబాద్ ఎమ్మెల్యే గీతారెడ్డి ధ్వజమెత్తారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల గ్రామ దళితులపై కేసులకు నిరసనగా పార్టీ పిలుపు మేరకు గురువారం జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో రాస్తారోకో చేపట్టారు. డీసీసీ అధ్యక్షురాలు, మాజీ మంత్రి సునీతారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా స్థానిక రాందాస్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. దాదాపు గంటసేపు రాస్తారోకో చేయడంతో ఇటు హైదరాబాద్, అటు బోధన్ మార్గంలో పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టాల్సిన ప్రభుత్వం పరోక్షంగా అక్ర మార్కులకు అండదండలు అందిస్తోందన్నారు. తెరాస ప్రభుత్వ దుర్మార్గపు పాలనను వ్యతిరేకించి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సునీతారెడ్డి మాట్లాడుతూ అక్రమార్కులను వెనకేసుకురావడం శోచనీయమన్నారు. మంత్రి కేటీఆర్.. ఇసుక లారీ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను కనీసం పరామర్శించకపోవడం దారుణమన్నారు. మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గంలోనూ మాఫియా తరహాలో అక్రమ ఇసుకదందా నడుస్తోందన్నారు. రాస్తారోకో అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రాన్ని సమర్పించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి శ్రవణ్‌కుమార్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నర్సింలు, కిసాన్‌సెల్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ డీసీసీబీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దళితులంటే తెరాసకు చులకన

### మాజీ మంత్రి సీఆర్‌ఆర్ ధ్వజం




హైదరాబాద్ : అధికారంలోకి రాకముందు దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్ ఆ పదవి ఇవ్వకపోగా.. ఇప్పుడు దళితులపై పోలీసుల చేత దాడులు చేయిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీమంత్రి సి.రాంచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. దళితులంటే తెరాసకు ఎందుకంత చులకనా? అని ఆయన ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల గ్రామ దళితులపై అక్రమంగా కేసులు బనాయించారంటూ.. సదరు పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో పాలనాప్రాంగణం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నియోజకవర్గ సంఖ్య పెంపుపై ఉన్న శ్రద్ధ దళితుల సంక్షేమంపై లేదన్నారు. దళితబస్తీ కింద దళితులకు పనికిరాని భూములను కట్టబెడుతూ తెరాస నాయకులకు లబ్ధి కలిగేలా చూస్తున్నారని ఆరోపించారు. పీసీసీ ప్రధానకార్యదర్శి గంగ్రత్ సుజాత మాట్లాడుతూ ముఖ్యమంత్రి తనయుడైన కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో దళితులపై దాడులు జరగడం అమానుషమన్నారు. ప్రజాస్వామ్య విధానంలో ప్రజలకు మేలు చేయాల్సిన మంత్రి హోదాలో కలిగిన ఆయన ఇసుకమాఫియాకు మద్దతు పలికేలా వ్యవహరించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. దాడి ఘటనను ఖండించకపోగా.. దాడి చేసిన వారిని కనీసం మంత్రి పరామర్శించిన పాపన పోలేదన్నారు. సాక్షాత్తూ మంత్రి నియోజకవర్గ ప్రజలకే ప్రభుత్వం నుంచి రక్షణ లేకపోతే మరెవరికి ఉంటుందో చెప్పాలని ప్రశ్నించారు. విచక్షణ రహితంగా దళితులను కొట్టించిన ఎస్పీని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేశారు. జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు నరేష్‌జాదవ్ మాట్లాడుతూ బంగారు తెలంగాణ అని చెబుతూ అప్పుల తెలంగాణగా మారుస్తున్నారని తెరాస పాలనను దుయ్యబట్టారు. కేటీఆర్‌కు నిజంగా దళితులపై ప్రేమ ఉంటే నేరేళ్ల ఇసుకమాఫీయా ఘటనపై సీబీఐ చేత విచారణ జరిపించాలన్నారు. హరితహారం కింద కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తూ మొక్కలు నాటుతున్నట్లు చెబుతున్నా అవి ఎక్కడా కనిపించడంలేదని ఎద్దేవాచేశారు. నాటిన ప్రతి మొక్క లెక్క చెప్పాలన్నారు. అనంతరం నిరసన శిబిరం నుంచి పాలనాప్రాంగణ ప్రధాన ద్వారం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ లోనికి వెళ్లేందుకు పోలీసులు కొందరినే అనుమతించారు. ఈ సందర్భంగా డీఆర్వో శంకర్‌కు వినతిపత్రం అందించారు.

ఈకార్యక్రమంలో మాజీమార్కెట్‌కమిటీ ఛైర్మన్ యాసం నర్సింగ్‌రావు, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భరత్‌చౌహాన్, యూత్‌కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, ప్రధానకార్యదర్శి వాహిద్, పట్టణ అధ్యక్షుడు వసీమ్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, నాయకులు మల్లెపూల నర్సయ్య, షఫీఉల్లాఖాన్, కందుల సుకేందర్, సాయిద్‌ఖాన్, సతీష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## వస్తువుల నాణ్యత లోపిస్తే బ్లాక్‌లిస్టులో పెడతాం: డీడీ

భద్రాచలం : ఆశ్రమ పాఠశాలలకు, వసతి గృహాలకు సరఫరా చేసే వస్తువుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత గుత్తేదారులను నల్ల జాబితా(బ్లాక్‌లిస్టు)లో పెడతామని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు సీహెచ్.రామ్మూర్తి హెచ్చరించారు. భద్రాచలంలో ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆశ్రమ పాఠశాలలకు వస్తువుల సరఫరా టెండర్ల ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వివిధ వస్తువులు సరఫరా చేసేందుకు సుమారు 84 మంది వ్యాపారస్థులు పాల్గొన్నారు. ఉప సంచాలకులు రామ్మూర్తి మాట్లాడుతూ.. స్టీలు పల్లాలు, గ్లాసులు, ఇడ్లీ పాత్రలు, బకెట్‌లు, జగ్గులు, రిజిస్టర్లు, గ్రంథాలయ పుస్తకాలు, వంటపాత్రలు ఇతర సామగ్రి సరఫరా చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. గుత్తేదారులు టెండరు ప్రక్రియలో తెలిపిన నమూనాల ప్రకారమే నాణ్యతతో కూడిన వస్తువులను సరఫరా చేయాలని అన్నారు. వస్తువుల నాణ్యత పరిశీలనలో నాసిరకం వస్తువులని తేలిన పక్షంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తప్పని అన్నారు.

## ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలి

సిద్దిపేట : ఇబ్రహీంపూర్ గ్రామం అన్ని విధాలా బాగుందని, యువత, మహిళల ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి సారించాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల కమిషనర్ నీతూ కుమారి ప్రసాద్ గ్రామస్థులకు సూచించారు. ఆమె గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉపాధి హామీ పనుల తీరు, గ్రామాల్లో ప్రజల జీవనోపాధి అవకాశాలు, ఉపాధి హామీ పథకంతో ప్రజల ఆర్థిక స్థితి మెరుగు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ ఏ మేరకు జరుగుతోందన్న విషయాలపై కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో త్వరలో దిల్లీలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఆయా శాఖ కమిషనర్లతో సమావేశం నిర్వహించనుందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పరిస్థితిని వివరించేందుకు సిద్దిపేట జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీలో ఏఏ పనులు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, యువత స్వయం ఉపాధికి ఎలాంటి అవకాశాలు పొందుతున్నారు. ప్రభుత్వాలు అందించే నిధులు, పథకాలు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఇబ్రహీంపూర్‌ను సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంకుడుగుంతలు, మొక్కల పెంపకం, ఇంటింటికి నిర్మించిన శౌచాలయాలు, పశువుల పాకలు, గొర్రెల షెడ్లు, డంపింగ్ యార్డు, డిజిటల్ తరగతి గదులు, నమూనా పంచాయతీ భవనం, మహిళా మండలి నిర్మాణాలను పరిశీలించారు. శతశతం అక్షరాస్యత, చెత్త సేకరణ విధానం, వైఫై సేవలు, మైక్ సౌండ్ వ్యవస్థ, సోలార్ విద్యుత్తు, బాలవికాస నీటి శుద్ధి కేంద్రాల ద్వారా తాగునీటి సరఫరాను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో మహిళలు, యువతతో సమావేశం నిర్వహించి జీవనోపాధి అవకాశాలపై ఆరా తీశారు. అంతకుముందు మండలంలోని బంజేరుపల్లిలో ఆమె మొక్క నాటి నీరు పోశారు. ప్రతి 400 మొక్కలకు ఒక సంరక్షకుడిని నియమించి, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎపీవో నర్సింగరావుకు సూచించారు. సర్పంచి లక్ష్మి, ఏపీడీ స్వామి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, స్వచ్ఛ మిషన్ జిల్లా సమన్వయకర్త చెన్నరెడ్డి, ప్రొగ్రాం అధికారులు కృష్ణమూర్తి, ఆంజనేయులు, ఎంపీడీవో సమ్మిరెడ్డి తదితరులు ఉన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

SVR గోల్డ్ లోన్స్
మీ బంగారాన్ని బ్యాంక్/ప్రైవేటు సంస్థలలో ఉన్నదానిని విడిపించి మార్కెట్ రేటు కంటే ఎక్కువకు కొనబడును.
Contact No:
75696 87774

శ్రీ దుర్గా మల్లేశ్వర ద్వాదశ జ్యోతిర్లింగ దేవాలయం
వివాహ విషయంలో ఆటంకములు ఎన్ని సంబంధములు చూసినా కుదరకపోవుట(స్త్రీలు, పురుషులు) సంతానం లేకపోవుట, వ్యాపార విషయంలో ఆందోళనలు, ఎంత కష్టపడినా ఫలితం లేకపోవుట, సమస్యల వలన సతమతమవుట, పైన ఉదహరించిన సమస్యలకు జాతక చక్రం వేసి, నాడీ పరీక్షించి, హస్త సాముద్రికం ద్వారా మీ సమస్యలకు ఖచ్చితమైన పరిష్కారం చూపబడును.
కాలసర్ప దోషం, నాగదోషం, కుజదోషం, రాహుకేతువుల పూజ, వివాహ విషయములకు, అన్ని రకముల పూజలకు సంప్రదించవచ్చును.
పెళ్ళిరోజు, పుట్టినరోజు, మీ ఉద్యోగ విరమణ ఇలా మరే సందర్భంలో అయిన అన్నదానం చేయు భక్తులు ముందుగా సంప్రదించినచో అతి తక్కువ ఖర్చుతో అన్నదాన కార్యక్రమం జరిపించి మరియు మీ గోత్ర నామముపై విశేష పూజ జరుపబడును.
సూచన : ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకుని రావలెను.
హైస్కూల్ గ్రౌండ్ ఎదురుగా, దేవి పీఠం, కొత్తవలస, విజయనగరం జిల్లా.
9441126714
8331827714

## సైనిక ఉద్యోగాల్లో యువతకు అవకాశాలు

ఆదిలాబాద్ : దేశానికి సేవ చేయాలని.. సరిహద్దుల్లో విధులు నిర్వహించాలని యువత చిన్నప్పటి నుంచి కలలు కంటారు.. అలాంటి వారికోసం ఎన్‌సీసీ అవకాశాల్ని కల్పిస్తోంది.. ఇందులో చేరినవారికి కఠోరమైన శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది.. వారికి సైనిక తరహా శిక్షణ అందిస్తోంది.. ఒకసారి ఇందులో చేరితే చాలు ఒక మంచి పౌరుడిగా.. సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందుతారు.. అందుకే ఎన్‌సీసీని భారత రెండో సైన్యం అంటారు.. ఇలాంటి శిక్షణను పూర్తి చేసుకున్న వారికి ఎ, బి, సి ధ్రువీకరణ పత్రాల అర్హతపరీక్షలు నిర్వహిస్తారు. సి ధ్రువీకరణ పత్రంలో ఉత్తీర్ణత సాధించినవారు సైనిక నియామక ఎంపిక ప్రక్రియలో పాల్గొనేందుకు అర్హులు.. ఇలా ఎన్‌సీసీలో శిక్షణ పొంది సైనిక ఉద్యోగాల్లో విధులు నిర్వహిస్తున్న 149 మంది కెడెట్లు (బాల సైనికులు సి ధ్రువీకరణ పత్రంలో అర్హత సాధించారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఎన్‌సీసీ 32టీ బెటాలియన్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కెడెట్లకు వివిధ అంశాల్లో కఠోర శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. సైనిక నియామక ఎంపిక ప్రక్రియకు సన్నద్ధం చేస్తోంది. ఎన్‌సీసీలో సి ధ్రువీకరణ పత్రం పొందిన ప్రతి కెడెటు రాతపరీక్ష లేకుండానే కేవలం సైనిక ఉద్యోగంలో చేరుతారు. ఇప్పటివరకు ఎన్‌సీసీ ద్వారా వందకు పైగా విద్యార్థులు సైనిక ఉద్యోగంలో చేరారు.

# ఆగస్టు 2 నుంచి జమలాపురంలో పవిత్రోత్సవాలు



ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆగస్టు 2 నుంచి 5వ తేదీ వరకు పవిత్రోత్సవాలు, శాకాంబరి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ రమణమూర్తి, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఉప్పల శివరామ్‌ప్రసాద్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో పాలక మండలి సభ్యులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, ఇతర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు చంద్రశేఖర్‌గుప్తా, నిర్మలకుమారి, వెంకయ్య, మంగమ్మ, వెంకటేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, చిట్టిబాబు, కాటంరాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణాభివృద్ధి పథకాలు ప్రజలకు ఉపయోగపడాలి

చంద్రుగొండ : ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి ద్వారా చేపట్టే పథకాలు ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ మోతీలాల్ అధికారులను ఆదేశించారు. చంద్రుగొండలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భ జలాలు పెంచేందుకు వాటర్ షెడ్, ఉపాధి పథకం తదితర పేర్లతో వచ్చే ప్రతిదీ పేదలకు ఉపయోగపడాలన్నారు. 24 జిల్లాల్లో వాటర్‌షెడ్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. ప్రధానమంత్రి కృషి యోజన కింద పనులు జరుగుతున్నాయన్నారు. రైతుల్లో చైతన్యం తీసుకొచ్చి భూగర్భ జలాలు పెంచితే భవిష్యత్తులో నీటిఎద్దడి ఉండదన్నారు. డీఆర్డీఏ పీడీ జగత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి కూలీలందరికి ఆధార్ ద్వారా వేతనాలు చెల్లింపులు జరిపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందన్నారు. ఉపాధి కూలీలందరికి జియో ట్యాగింగ్ వేగంగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనులు నాణ్యతప్రమాణంగా జరిగేలా చూడాలని ఆయన ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. రాష్ట్ర సాంకేతిక నిపుణుడు శ్యాం, అడిషినల్ పీడీ వెంకటపతిరాజు, ఎంపీపీ బాలు, ఎంపీడీవో మహాలక్ష్మి, ఈజీఎస్ ఏపీవో ఉదయశ్రీ, ఈజీఎస్ సిబ్బంది, వాటర్‌షెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్‌లో రూ.5 భోజనం

వీరన్నపేట : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో త్వరలో రూ.5కు భోజనం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్షయపాత్ర వంటశాల ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మహబూబ్‌నగర్ మండల పరిధిలోని పాల్‌కొండ సమీపంలో 1.20 ఎకరాల స్థలంలో దీని నిర్మాణం జరగనుంది. మొదట ధర్మాపూర్‌లో ఏర్పాటు చేయాలని అనుకున్నప్పటికీ దానిని మార్పు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. రూ.6 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించనున్నారు. దీని ద్వారా హైదరాబాద్ తరహా మొదట మహబూబ్‌నగర్‌లోని ప్రధాన కూడళ్లలో రూ.5 భోజనం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మొదటగా జిల్లా ఆస్పత్రి ఎదుట కట్టిన ప్రయాణ ప్రాంగణం వద్ద ప్రత్యేక షెడ్డు వేసి అక్కడ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీని నిర్మాణ పనులు ఈ నెల చివరలో ప్రారంభించే అవకాశం ఉంది. పూర్తిస్థాయిలో నిర్మాణ ప్రక్రియ పూర్తయిన తరవాత జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్‌వాడీలకు సైతం భోజనం సరఫరా చేస్తారు. ఈ మేరకు అవసరమైన ప్రణాళికలను అధికార యంత్రాంగం సిద్ధం చేస్తోంది.

## ఆర్టీసీలో ప్రమాద రహిత వారోత్సవాలు ప్రారంభం

మహబూబ్‌నగర్ : ఆర్టీసీలో ప్రమాద రహిత వారోత్సవాలను డీవీఎం మహేశ్ మహబూబ్ నగర్ డిపోలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, మెకానిక్‌లు, ఇతర సాంకేతిక సిబ్బందికి ప్రమాదాల నివారణపై సూచనలు ఇచ్చారు. మెకానిక్‌లు యంత్రలోపాలను ఎప్పటికప్పుడు గుర్తించి సకాలంలో మరమ్మతులు చేయడం ద్వారా ప్రమాదాలను అరికట్టగలుగుతామన్నారు. విధులు ముగిసిన తరవాత బస్సులో ఎలాంటి లోపాలు తలెత్తాయో డ్రైవర్లు సైతం బస్సు డిపోకు చేరిన వెంటనే మెకానిక్‌ల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. డ్రైవర్లు దురలవాట్లకు లోనుకావద్దని, మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. డ్రైవర్లు మానసిక ఒత్తిడి తట్టుకునేందుకు రోజూ ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో డీవీఎం రాజగోపాల్‌రావు, చెందిన నాయకులు, డ్రైవర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి బిల్లులు సిద్ధం



మహబూబ్‌నగర్ : కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ల సాయంలో ఆలస్యంపై జిల్లా కలెక్టర్ రొనాల్డ్‌రోస్ స్పందించారు. కల్యాణలక్ష్మి దరఖాస్తులు, నిధులు విడుదల తదితర అంశాలపై సమగ్ర సమాచారం సేకరించి వెంటనే నివేదించాలని, పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.వెంకటేశ్వర్లుకు సూచించారు. దీంతో ఆయన వెంటనే జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో సమాచారం సేకరించి ఏ స్థాయిలో ఎవరి వద్ద దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలు సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినా.. కొందరు అధికారులు తాత్సారం చేస్తున్నట్లు గుర్తించి వెంటనే బిల్లులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహబూబ్‌నగర్ డివిజన్ పరిధిలో ఎస్సీలకు సంబంధించి 10 దరఖాస్తులు, బీసీ 33, షాదీముబారక్ దరఖాస్తులు 20 మొత్తం 63 దరఖాస్తులకు రూ.47,32,308లు నిధులు మంజూరుకు సంబంధిత అధికారులతో సిఫార సు చేయించారు. నారాయణపేట డివిజన్ పరిధిలో ఎస్సీ 17, బీసీ 67, ఎస్‌టీ 12, షాదీముబారక్ దరఖాస్తులు 21 మొత్తం 117 దరఖాస్తులకు గాను ఒక్కో దరఖాస్తుకు రూ.75,116లు నిధులు మొత్తం రూ.87,88,572 మంజూరుకు సిఫారసు చేశారు. వీటికి సంబంధించిన ప్రొసీడింగ్‌లను అధికారులు అంతర్జాలంలో పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 180 దరఖాస్తులకు మోక్షం లభించింది. వీటికి గాను రూ.1,35,20,880 బిల్లులు చేసి చెక్కుల అందజేతకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటి వరకు కేవలం రూ.51 వేల ఆర్థిక సాయం అందించిన అధికారులు ఒక ఏప్రిల్ 1వ తేదీ అనంతరం పెళ్లిళ్లు అయిన వాటికి రూ.75,116 అందించేందుకు చర్యలు వేగిరం చేశారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మంత్రి జోగు రామన్న

నర్సాపూర్: రాష్ట్ర వ్యాప్తంగా హరితహారంలో 230 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర అటవీశాఖ మంత్రి జోగురామన్న తెలిపారు. నర్సాపూర్ అడవిలోని ఖాళీ ప్రదేశంలో చేపట్టిన హరిత హారంలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 13 రోజులుగా హరితహారం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. అధికారులు, ప్రజాప్రతి నిధుల భాగస్వామ్యంతో మొక్కలు నాటుతు న్నట్లు చెప్పారు. గతప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగానే అడవులు అంతరించిపోయా యన్నారు. రాబోయే తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని బిడ్డల్లా సంరక్షిం చాలని అన్నారు. రాష్ట్రంలో 24 శాతం మాత్రమే ఉన్న అడవులను 33 శాతానికి తీసుకురా వాలన్నారు. దూరదృష్టితో, దృఢసంకల్పంతో మొక్కలు నాటాలన్నారు. మెదక్ జిల్లాలో 51 వేల హెక్టార్లలో అడవులున్నాయని చెప్పారు. అడవు ల్లో చాలాచోట్ల ఖాళీ ప్రదేశాలు కనిపిస్తున్నా యన్నారు. లక్ష మొక్కలు నాటాలని సూచిం చారు. నాటిన మొక్కల సంరక్షణకు 51 మందితో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అడవుల్లో అయిదు, పది ఎకరాల వరకు పేద రైతులు ఆక్రమించారన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఆక్రమణలో ఉన్నారని, వారి నుంచి స్వాధీన పర్చుకుంటామని చెప్పారు.

ములుగు జడ్పీటీసీ సభ్యులు 50 ఎకరాల వరకు అటవీ భూమిని ఆక్రమించగా స్వాధీనపర్చుకున్నామని, పార్టీ నుంచి సస్పెండ్ కూడా చేశామన్నారు. అటవీ భూములను ఆక్రమించినవారు ఎంతటివారైనా ఉపేక్షిం చమని స్పష్టం చేశారు. పదివేల మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి జోగురామన్నతో పాటు ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి, పీసీసీఎఫ్ పీకే జా, సీసీఎఫ్ ఏకే సిన్హా, డీఎఫ్ఓ పద్మజారాణి, ఎఫ్ఆర్వో రాఘ వేందర్‌రావు, జడ్పీ అధ్యక్షురాలు రాజమణి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, తెరాస జిల్లా అధ్యక్షులు మురళీయాదవ్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్, ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలు మారాయి.. కార్డులు మూలకు చేరాయి

ఆదిలాబాద్ : కొత్త జిల్లాల ఏర్పాటుతో కొత్త ఆహార భద్రతకార్డులకు సమస్య వచ్చిపడింది. ఉమ్మడి జిల్లాల పేరుతో తయారైన ఈ కార్డులు కొత్తగా ఆవిర్భవించిన జిల్లాలకు సరఫరా చెయ్యలేని పరిస్థితి ఉండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఏర్పడ్డాక ఇంట్లో నలుగురికి మాత్రమే బియ్యం ఇవ్వాలనే నిబంధనను తొలగించి ప్రతిఒక్కరితోపాటు ఒక్కొక్కరికి 6 కిలోల బియ్యం ఇవ్వాలని వెసులుబాటు కల్పించి రేషన్‌కార్డుల స్థానంలో కొత్తగా ఆహారభద్రత కార్డులను ప్రవేశపెట్టింది. అయితే మొదట తాత్కాలికంగా అట్ట ముక్క మాదిరిగా ఉండే కార్డులు జారీచేసిన ప్రభుత్వం వాటి స్థానంలో ముఖ్యమంత్రి చిత్రంలో కొత్తకార్డులను తయారుచేయించింది. సెమికోడ్ ల్యామినేషన్‌తో ఉండే ఈ కార్డులను జిల్లా, మండలం, లబ్ధిదారుడి పేరు, కుటుంబసభ్యుల పేర్లతో ముద్రించారు. ఇది ఎండకు చెడిపోదు, వానకు తడవదు. కాల్చినా కాలిపోదని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా తయారుచేసిన ఈ ఒక్కోకార్డుకు రూ.4 పై చిలుకు ఖర్చుచేశారని సమాచారం. కేవలం ఉమ్మడి ఆదిలాబాద్ (ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం) జిల్లావ్యాప్తంగా 7.86 లక్షల కార్డులకు లెక్కిస్తే రూ.31 లక్షలకుపైగానే ఖర్చుఅయినట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా రూ.5 కోట్లకుపైగానే ఖర్చయినట్లు సమాచారం.

ప్రస్తుతం ఆ కార్డులపై ఆదిలాబాద్ జిల్లా అని ఉండడం, కొత్తగా ఇక్కడ మరో మూడు జిల్లాలు ఏర్పడడంతో ఆ మూడు జిల్లాల్లో ఆ జిల్లా పేర్లతో కొత్తగా కార్డులు ముద్రించాల్సి ఉండడంతో ఈ కార్డులు పంపిణీ చెయ్యలేని పరిస్థితి. దీంతోపాటు కొత్త మండలాలు ఏర్పడడంతో ఆ మండలంలోని లబ్ధిదారుడి మండలం పేరు కూడా మార్చాల్సి ఉంటుంది. దీంతోనే జిల్లాల ఏర్పాటుకు ముందు ముద్రించిన ఈ కొత్త ఆహార భద్రతకార్డులు ఉమ్మడి జిల్లా ఉన్న సమయంలో సరఫరా అయినా అన్ని జిల్లాల్లో మూలకుపడేసి ఉన్నాయి.

ఈ కార్డుల్లో కొన్నివరకైనా ఉపయోగపడుతాయి. ఉదాహరణకు విభజనకు ముందు పాత ఉమ్మడి జిల్లాపేరు ఆదిలాబాద్. ఇలా కొత్తగా 18 మండలాలతో ఆవిర్భవించిన ఆదిలాబాద్ జిల్లాలో అదే జిల్లాపేరు ఉంటుంది. కాబట్టి ఈ కార్డులు అక్కడ పంపిణీ చేయవచ్చు. కాకపోతే ఇక్కడ కొత్తగా నాలుగు మండలాలు ఏర్పడడంతో అక్కడ మళ్లీ సమస్య వస్తుంది. ఇది పక్కనబెడితే ఇటు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాకపోవడంతో వీటిని ఏంచేయాలో అధికారులకు అర్థం కావడం లేదు.

# గిరిజన సహకార సంఘాలను బలోపేతం చేస్తాం

## జీసీసీ రాష్ట్ర ఛైర్మన్ ధరావత్ మోహన్‌గాంధీ నాయక్



ఇచ్చోడ : రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సహకార సంఘాలను మరింత బలోపేతం చేస్తామని జీసీసీ రాష్ట్ర ఛైర్మన్ ధరావత్ మోహన్‌గాంధీ నాయక్ అన్నారు. ఆయన ఇచ్చోడ మండలం సిరిచెల్మ జీసీసీ డీఆర్‌డీపో ఆవరణలో అటవీ ఉత్పత్తులపై గిరిజనులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలకులు తెలంగాణలో జీసీసీలు అభివృద్ధి కాకుండా కుట్ర చేశారని, ఐదు డివిజన్‌లను కేవలం మూడుకు కుదించారని అన్నారు. గిరిజన సహకార సంఘాల సమస్యలు, అటవీ ఫలసాయం సేకరణలో ఇక్కట్లు, గిట్టుబాటు ధరలను తెలుసుకొని సీఎం కేసీఆర్‌కు వివరిస్తానని తెలిపారు. ఇప్పపువ్వు, తేనెకు ధరను త్వరలోనే పెంచుతామని, ఇప్పపరకను రూ.14.50 నుంచి రూ.20కి పెంచామని, తేనె శుద్ధి కర్మాగారాన్ని నిర్మల్‌లో ఏర్పాటు చేశామని వివరించారు. ఇప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విద్యార్థులకు కావాల్సిన ఆహార ధాన్యాలను సరఫరా, పెట్రోల్ బంకుల ఏర్పాటు, రైతులు పండించే ధాన్యం కొనుగోలు చేసేందుకు నిర్ణయించామన్నారు. జీసీసీల ద్వారా గిరిజనులకు రుణాలు ఇచ్చేందుకు సైతం ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. యూరియా, ఎరువులు, దుస్తులు, నిత్యవసర సరకులను జీసీసీల సేల్స్‌మెన్‌ల ద్వారా విక్రయించే ఏర్పాట్లు చేశామని చెప్పారు. జీసీసీల్లో ఖాళీల భర్తీ, ఉద్యోగులకు పదోన్నతులు, గిరిజన, గిరిజనేతర గ్రామాల్లో సంఘాల సేవలను విస్తరించి, అవసరమైన చోట అటవీ ఫలసాయ శుద్ధి కేంద్రాలను నెలకోల్పుతామని చెప్పారు.

హరితహారంలో అటవీ ఫలసాయం అందించే కానుక, ఇప్ప, ఆమ్ల, చింత, తప్పి, చిల్ల గింజల చెట్ల నర్సరీలను ఏర్పాటు చేస్తున్నట్లు జీసీసీ రాష్ట్ర జనరల్ మేనేజర్ వి.సీతారాం నాయక్ పేర్కొన్నారు. ప్రతి గిరిజన గ్రామాల్లో అటవీ ఉత్పత్తుల చెట్లను నాటించాలని అటవీశాఖను సైతం కోరామన్నారు. ఈ సందర్భంగా అటవీ ఉత్పత్తులు సేకరించే వారి ఇబ్బందులు, గిట్టుబాటు ధర తదితర అంశాలపై చర్చించారు. ఇందుకు గిరిజనులు అటవీ ఉత్పత్తులన్నింటి ధరను పెంచాలని, అడవుల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. సిరిచెల్మ జీసీసీ డీఆర్‌డీపో గోదాం భవనం శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం నిర్మించాలని కోరారు. ఛైర్మన్ గిరిజనులు సేకరించిన తేనె, డీఆర్‌డిపోలో సరకులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉట్నూర్ జీసీసీ డివిజనల్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, ఇచ్చోడ మేనేజర్ అడె ధన్ను, సర్పంచి లక్ష్మీకన్నమయ్య, ఎంపీటీసీ సభ్యుడు సుంగు, వీటీడీఏ వైస్‌ఛైర్మన్ బైరి లచ్చన్న, ఈఓపీఆర్‌డీ ఫసియొద్దిన్, జీసీసీ గణాంక అధికారి రమేష్, సేల్స్‌మెన్‌లు పీతాంబర్, భీంరావ్, జంగు, నాయకులు అబ్దుల్ హజీం, మల్లయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్తు కార్మిక సంఘాలకు ఎన్నికలు

## నాలుగు జిల్లాల్లో వూపందుకున్న ప్రచారం

మామడ : సుదీర్ఘ విరామం తర్వాత విద్యుత్తు కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు కార్మికశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఆగస్టు 8న ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న 70 శాతానికి పైగా కార్మికులకు ఇదే తొలి ఎన్నిక. ఎందుకంటే 1989 తర్వాత ఎన్నికలు మళ్లీ ఇప్పుడే జరుగుతున్నాయి. దీంతో కార్మికుల్లో, బరిలో నిలిచిన సంఘాల్లో ఎంతో ఉత్సాహం కనిపిస్తోంది. గుర్తుల కేటాయింపు జరగడం, నమూనా బ్యాలెట్లు విడుదలవ్వడంతో ప్రచారం వూపందుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు సంఘాలకు ప్రాతినిధ్యం ఉంది. రెండు సంఘాల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. అన్ని మండలాలకు జిల్లా స్థాయి సంఘ నాయకులు వచ్చి కార్మికులను కలుస్తున్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాలకు ఎన్నికలు జరిగే సమయంలో కనిపించే సందడి ఇప్పుడు విద్యుత్తు కార్మిక ఎన్నికల్లో కనిపిస్తోంది. అన్ని సంఘాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుండంతో ఎవరికి ప్రాతినిధ్యం దక్కుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

విద్యుత్తు కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు 28 ఏళ్ల అనంతరం జరుగుతున్నాయి. 1989 తర్వాత మళ్లీ ఎన్నికలు నిర్వహించలేదు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడే విద్యుత్తు వ్యవస్థలో సంస్కరణలు మొదలయ్యాయి. ప్రక్షాళన చేస్తున్న నేపథ్యంలో సంఘాల ఎన్నికలు అంత అవసరం లేదన్న భావనతో అధికారంలోకి వచ్చిన అన్ని పార్టీలు గుర్తింపు ఎన్నికలపై మక్కువ చూపలేదు. సంఘాలు ప్రతిసారి ఇందుకు డిమాండ్ చేసినా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ప్రధాన సంఘాలతో పాటు చాలా వాటికి గుర్తింపునిచ్చి డిమాండ్లను తాత్కాలికంగా సద్దుమనిగేలా చేశారు. దీంతో రాష్ట్రంలో 30కి పైగా సంఘాలు ఏర్పాటయ్యాయి. బదిలీలు ఇతర విషయాల్లో సంఘ నాయకులకు మినహాయింపునిచ్చే క్రమంలో క్షేత్రస్థాయిలో కొంత ఇబ్బందికర పరిస్థితులు కనిపించాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ప్రభుత్వంతో చర్చల సమయంలో వివిధ సందర్భాల్లో పెద్దఎత్తున సంఘాల ప్రతినిధులు రావడం, ఒక్కొక్కరు ఒక్కో విధంగా డిమాండ్లు చేస్తుండటంతో ప్రభుత్వం గుర్తింపు సంఘం ఎన్నిక వైపు ఆలోచన చేసింది. అప్పటికే కార్మిక సంఘాలకు ఎన్నికల పట్ల ఆసక్తి ఉండటంతో ఎన్నికల నగారా మోగేవరకు ముహూర్తం వచ్చేసింది.

రాష్ట్ర విద్యుతుత్పత్తి సంస్థ(జెన్‌కో), విద్యుత్తు సరఫరా సంస్థ(ట్రాన్స్‌కో), ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(టీఎస్-ఎన్పీడీసీఎల్), దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ (టీఎస్-ఎస్పీడీసీఎల్) సంస్థలకు కలిపి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వీటి పరిధిలో 20 వేల మంది కార్మికులున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం, మంచిర్యాల జిల్లాలో పరిధిలో మొత్తం 783 మంది ఓటర్లు ఉన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో నాలుగు సంఘాలు బరిలో ఉన్నాయి. తెలంగాణ విద్యుత్తు ఉద్యోగుల సంఘం (1104), తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు కార్మిక సంఘం (హెచ్-58), తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు ఉద్యోగుల సంఘం (327), తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ సంఘం (ఇ-1535) పోటీలో ఉన్నాయి. ఇప్పటికే కార్మిక శాఖ గుర్తులు కేటాయించింది. నమూనా బ్యాలెట్లు కార్మికుల చేతికొచ్చాయి. సగానికి పైగా ఓటర్లకు సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం ఇదే తొలిసారి కావడంతో నాయకులు ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. అన్ని జిల్లాల్లోని డివిజన్, సబ్ డివిజన్ కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలను కార్మికశాఖ ఏర్పాటు చేయనుంది. ఎన్నిక ఆగస్టు 8న జరిగితే లెక్కింపు 16న నిర్వహించనున్నారు.

